సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 12 । జూలై । 2023



డేంజర్‌బెల్ @ సాగర్ రోడ్డు

హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అక్రమ నిర్మాణాలతో కుచించుకుపోయింది. 8లో▸



మరోసారి ఆదరించండి

అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. 8లో▸



ఆమనగల్లుకు డిగ్రీ కళాశాల

ఆమనగల్లుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



వీధి వ్యాపారుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: వీధివ్యాపారస్తుల షెడ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు సుందరీకరణ పనులను మంగళవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాకింగ్ ట్రాక్ పనుల్లో వేగం పెంచాలన్నారు. వీధివ్యాపారుల కోసం నూతనంగా నిర్మిస్తున్న షెడ్లను పూర్తి చేసి వారికి అందజేయాలని సూచించారు. మంత్రి వెంట డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద యోజనకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి తెలిపారు. చేపల సంచార వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ఐస్ బాక్స్‌లు సబ్సిడీపై మంజూరు చేస్తారని చెప్పారు. అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు దారుడి అనుమతి పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలన్నారు. మొదటి దరఖాస్తుదారులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కేటగిరీ ప్రకారం అనుమతి పొందిన యూనిట్లకు మాత్రమే సరఫరా చేస్తామన్నారు. అర్హత కలిగిన వారు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బోనాలు



వనదుర్గకు పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లోని వన దుర్గామాత ఆలయ ప్రాంగణంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ హరీశ్ దంపతులు, డీఆర్‌ఓ హరిప్రియ ప్రత్యేక పూజలు చేవారు. అనంతరం మహిళా ఉద్యోగులు బోనాలతో ప్రదర్శనగా కలెక్టరేట్‌లోని వనదుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. జిల్లా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఉత్సవాల్లో కలెక్టరేట్ ఏఓ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులే కారణం

- క్రికెట్ బెట్టింగ్‌లో నష్టపోయి నరేశ్ ఆత్మహత్య
- ముగ్గురు నిందితుల అరెస్టు

కడ్తాల్: క్రికెట్ బెట్టింగ్‌లో ఓ యువకుడు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న కేసును పోలీసులు ఛేదించారు. అప్పు ఇచ్చిన ముగ్గురు వ్యక్తుల వేధింపులే అతని ఆత్మహత్యకు కారణమని తేల్చారు. గత నెల 27న కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండిలో ఓ కేతావత్ నరేశ్ (18) బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన సభావట్ వినోద్, మైసిగండికి చెందిన రామవత్ సుభాష్, కేతావత్ సిరాజ్ అలియాస్ చిన్నా వద్ద మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ నరేశ్ క్రికెట్ బెట్టింగ్ ఆడే విషయంలో వీరి వద్ద వడ్డీకి అప్పు తీసుకున్నాడు. దీంతో పాటు ఇంట్లో ఉన్న కొంత నగదును క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టాడు. అయితే బెట్టింగ్‌లో తీవ్రంగా నష్టపోయాడు. ఇంతలోనే అప్పు ఇచ్చిన వారు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి పెంచగా.. కొంతమేర చెల్లించాడు. మిగతావి వాయిదాల రూపంలో చెల్లిస్తానని చెప్పాడు. అయినా అప్పు ఇచ్చిన వారు వినకపోవడంతో నరేశ్ తన వద్ద ఉన్న బైక్, సెల్‌ఫోన్ ఇచ్చాడు. అయినా వారి వేధింపులు తగ్గలేదు. అప్పు చెల్లించు.. లేకపోతే చావు హెచ్చరించారు. దీంతో నరేశ్ తీవ్ర మనస్తాపం చెంది గతనెల 27న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేపట్టారు. వేధింపులతో పాటు నరేశ్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించిన కారణంగా.. నిందితులు వినోద్, సుభాష్, చిన్నాలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పారిశుద్ధ్యం.. ఆటంకం

సమ్మెలోకి పంచాయతీ కార్మికులు

- డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళనబాట
- పల్లెల్లో పారిశుద్ధ్యంపై ప్రభావం
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



షాద్‌నగర్: సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులు

షాద్‌నగర్/షాబాద్: వారంతా వేకువజామునే పల్లెల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తుంటారు.. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తారు.. డంపింగ్ యార్డుకు చెత్తను చేరవేసి స్వచ్ఛతలో భాగస్వాములవుతారు.. వీధుల్లో చీకటి ఉంటే స్తంభాలు ఎక్కి వీధి దీపాలను అమర్చి వెలుగులు వచ్చేలా చేస్తారు.. ఎండ, వాన, చలిని లెక్క చేయకుండా వేతనాలు తక్కువైనా విధులు నిర్వర్తిస్తూ పంచాయతీల అభివృద్ధికి పాటుపడుతున్నారు. అలాంటి కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచిఉంది.

నిలిచిన వేతనాలు..

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు కొద్ది నెలలుగా నిలిచిపోయాయి.వీరికి సాధారణంగా రూ.5,800 వేతనం చెల్లించాల్సి ఉంటుంది.అదనంగా పనిచేస్తున్న కార్మికులకు సర్దుబాటు చేస్తూ ఈ వేతనంలో కోత విధిస్తున్నారు. వచ్చే జీతం కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గతంలో జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్షాయోజన కింద బీమా సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి ప్రభుత్వం బీమా నగదు చెల్లించడం లేదు.అప రిశుభ్రవాతావరణంలో పని చేస్తుండటంతో అనారోగ్యం బారిన పడుతున్నామని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బీమా సౌకర్యం లేకపోవడంతో కు టుంబాలకు భరోసా ఉండటం లేదని వాపోతున్నారు.

విధిలేక సమ్మెబాట

పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు, గుమస్తాలు, పంపు ఆపరేటర్లు, స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు సమ్మెలోకి దిగారు. వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని మండల కేంద్రాల్లో సామూహిక నిరాహార దీక్షలు చేపడుతున్నారు.

వెయ్యి మందికిపైగా విధుల్లో...

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 585 పంచాయతీలు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 3,199 మందికిపైగా కార్మికులు విధుల్లో ఉన్నారు. వీరిలో వెయ్యి మందికి పైగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో మల్టీపర్పస్ కార్మికులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం, రోడ్లను శుభ్రం చేయడం, హరితహారం పనులు, క్లోరినేషన్, పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు, నీటి సరఫరా, పంచాయతీ ట్రాక్టర్ల డ్రైవింగ్, విద్యుత్ పనులు, నీటి సరఫరా, పంచాయతీ కార్యాలయంలో పనులు వీరే చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోతే వ్యాధులు ముసురుకునే ప్రమాదం పొంచిఉంది.

ఇవీ కార్మికుల డిమాండ్లు

- ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ప్రత్యేక బడ్జెట్ నుంచి వేతనాలు చెల్లించాలి.
- జీఓ నంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి.
- పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లందరినీ సహాయ కార్యదర్శులుగా నియమించాలి.
- విధుల్లో ఉన్న సిబ్బంది మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి.
- ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్సుల జారీతో పాటు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి అంత్యక్రియలకు తక్షణమే రూ.30 వేలు అందించాలి.
- ఏటా అందించే యూనిఫాం, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలకు డబ్బులను అలవెన్సు రూపంలో చెల్లించాలి.
- పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించడంతో పాటు, గుర్తింపు కార్డులను అందజేయాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలి.
- సిబ్బందిపై వేధింపులు ఆపాలి.

సమ్మెకు మద్దతు

కార్మికులు చేపడుతున్న సమ్మెకు వివిధ కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. కార్మికుల తరఫున వివిధ రూపాల్లో ఆయా సంఘాల నేతలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెల్లో పాల్గొని వారికి అండగా నిలుస్తున్నారు.

రెక్కాడితే గానీ డొక్కాడదు



ఎన్నో కష్టాలకు ఓర్చి పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రెక్కాడితే కాని పూటగడవని పరిస్థితి ఉంది. సమస్యలు పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అయినా పట్టించుకోవడం లేదు.

– భాగ్యమ్మ, కార్మికురాలు, దూసకల్, ఫరూఖ్‌నగర్

వేతనాలు పెంచాలి



పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలి. వేతనాలు పెంచాలి. అప్పటి వరకు సమ్మె నిర్వహిస్తాం.

– గడ్డమీది లక్ష్మయ్య, కార్మికుడు, తాళ్లపల్లి, షాబాద్

ప్రజలు సహకరించాలి



పంచాయతీ కార్మికుల దయనీయ పరిస్థితి నేపథ్యంలో సమ్మె నిర్వహిస్తున్నాం. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. అర్థం చేసుకుని ప్రజలు సహకరించాలి.

– అల్లి దేవేందర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే..

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: ఏదైనా సాధించాలనే సంకల్పం, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఎలుకుర్తి జగదీశ్వర్ సహకారంతో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని 500 మంది విద్యార్థినులకు మంగళవారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పర్చుకుని సాధనకోసం నిరంతరం శ్రమించాలని, ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, దానికి మరింత పదును పెడితే మంచి ర్యాంకులను సాధిస్తారని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చదివే పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేశ్‌గుప్తా, జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గుప్తా, కార్యదర్శి గందె సురేష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్ గుప్తా, సర్పంచ్ సిరిగిద్ద లలిత, మాజీ సర్పంచ్ అనుమారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో అభివృద్ధి



కంపోస్ట్‌షెడ్డును పరిశీలిస్తున్న మారం నాగేశ్వరరావు తదితరులు

- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ఉపాధి కల్పన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి నాగేశ్వరరావు

కడ్తాల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెప్రగతితో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ఉపాధి కల్పన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి మారం నాగేశ్వరరావు అన్నారు. జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికైన కడ్తాల్ పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు 2023 సంవత్సరానికి గాను జిల్లాలో 14 పంచాయతీలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లు, తడిపొడి చెత్త వేరు చేసే విధానం, ఇంకుడు గుంతల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం ఈనెల 15 నుంచి ఆయా పంచాయతీలను సందర్శించనున్నట్లు చెప్పారు. గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వీలైనన్ని ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మధుసూదనాచారి, ఏపీవో లలిత, టెక్నీకల్ ఈసీ అంజయ్య, కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణలో భాగస్వాములు కావాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: జనాభా నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ పద్ధతి పాటిస్తే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. జనాభా పెరగడం ద్వారా ఉద్యోగావకాశాలు సరిగా లభించవని, విద్యా పరంగానూ నష్టం జరుగుతుందని అన్నారు. భూమి పెరగడానికి అవకాశం లేనందున జనాభా పెరగడం ద్వారా నష్టాలే తప్ప లాభాలు ఉండవని స్పష్టం చేశారు. కచ్చితంగా వివాహ వయస్సును ప్రోత్సహించాలని, మొదటి బిడ్డ పుట్టిన తర్వాత రెండో సంతానానికి మధ్య వ్యవధి పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, జిల్లా స్టాటిస్టికల్ అధికారి రాజకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



హైతాబాద్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

షాబాద్: మహిళా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హైతాబాద్, పెద్దవేడు, నాన్‌చెర్లఖాన్‌పేట్, లింగారెడ్డి గ్రామాల్లో చేపట్టిన పల్లెపల్లెకూ పట్నం అవినాశ్‌రెడ్డి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అను నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, సులోచన, శేఖర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిబస్సుకు ముకుతాడు

- తల్లిదండ్రులు ఓకే అంటేనే వాహనం రోడ్డెక్కాలి
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలో పేరెంట్స్ భాగస్వామ్యం
- మార్గదర్శకాల రూపకల్పనలో ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు
- వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: గత జూన్ 15న మీర్‌చౌక్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో 50 ఏళ్ల మహిళ తస్నీమ్ కౌసర్ మృతి చెందింది. ఈ నెల 10న బాలాపూర్‌లో స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం చిన్నారి మృతికి కారణమైంది. తల మీది నుంచి బస్సు దూసుకెళ్లడంతో ఆరేళ్ల చిన్నారి భావన తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించింది.. ఒకటి రెండు కాదు ఈ ఏడాదిలో ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్‌లో తొమ్మిది స్కూల్ బస్సు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో రెండు ప్రమాదాలు ఘోరమైనవి కాగా.. 7 సాధారణ రోడ్డు ప్రమాదాలు. ఆయా ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా.. అరుగురికి గాయాలయ్యాయి. బస్సుల ఫిట్‌నెస్‌ల పైనే కాకుండా డ్రైవర్ల సామర్థ్యంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో తల్లిదండ్రులనూ భాగస్వాముల్ని చేయాలని నిర్ణయించారు. రవాణా శాఖ అధికారులు (ఆర్టీఏ), ట్రాఫిక్ పోలీసులు మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఇక నుంచి పేరెంట్స్ కమిటీ బస్సులను భౌతికంగా పరిశీలించి, సంతృప్తి చెందిన తర్వాతే బస్సులకు సామర్థ్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయనున్నారు.

నియంత్రణ వ్యవస్థ ఎక్కడ?

రవాణా సౌకర్యం పేరిట పాఠశాల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చార్జీ చేస్తుంటాయి. గ్రేటర్‌లో చాలా వరకు పాఠశాలలు బస్సుల నిర్వహణ బాధ్యతలను థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. ఫలితంగా చాలా మంది అనుభవం లేని డ్రైవర్లు ఈ వృత్తిలోకి ప్రవేశిస్తున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతి వేగం వంటి వాటిని తల్లిదండ్రులు గుర్తిస్తే తప్ప ఈ లోపాలను తనిఖీ చేసే లేదా నియంత్రించే యంత్రాంగం స్కూల్ యాజమాన్యాల వద్ద లేవు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్ వంటి వ్యవస్థ లేకపోవటంతో డ్రైవర్లు, హెల్పర్లు పిల్లలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, మందలించడం వంటి సందర్భాలూ అనేకం జరుగుతున్నాయి.

బడి బస్సులకు పైపై మెరుగులే..

రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యా సంస్థలు విద్యార్థులను తీసుకొచ్చే బస్సుల భద్రత విషయంలో అశ్రద్ధ వహిస్తున్నాయి. పైపై మెరుగులతోనే బస్సులను రోడ్డెక్కిస్తున్నాయి. బ్రేక్‌లు, క్లచ్‌ల నిర్వహణ సరిగా లేకపోవటం, అత్యవసర ద్వారాలు లేకపోవటం, పాత లేదా అరిగిపోయిన టైర్లతోనే నడపడం, వృద్ధ డ్రైవర్లు.. ఇలా అనేక అంశాల్లో నిబంధనలను పట్టించుకోకుండా బస్సులను నడుపుతున్నారు. ఆర్టీఏ ఫిట్‌నెస్ పరీక్షల్లో ఈ లోపాలు బయటపడుతున్నాయి. ప్రస్తుతం గ్రేటర్‌లో 20 వేలకుపైగా స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్‌లో 350, మేడ్చల్‌లో 700, రంగారెడ్డిలో 1,200 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందలేదు.

మార్గదర్శకాలివే..

- బస్సుల భౌతిక పరిస్థితిని పర్యవేక్షించడానికి ప్రతి విద్యాసంస్థ తల్లిదండ్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా రికార్డును ఏర్పాటు చేయాలి. ప్రతి త్రైమాసికంలో నిర్వహణ,ఫిర్యాదుల పురోగతిని సమీక్షించాలి.
- ప్రతి స్కూల్ బస్సుకు శాశ్వత డ్రైవర్ ఉండాలి.
- 3 నెలలకు ఒకసారి డ్రైవర్‌కు కంటి చూపు పరీక్షలు నిర్వహించాలి. అలాగే డ్రైవర్ల ఆరోగ్య సంబంధిత రికార్డులను నిర్వహణ చేయాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, వాహన పర్మిట్‌లను ఆర్టీఏ అధికారులు ధ్రువీకరించాలి.
- బస్సులు ట్రిప్ పూర్తయిన తర్వాత మెకానికల్ విభాగానికి పంపించి, తనిఖీ చేయించాలి.
- బడి బస్సుకు బీమా సౌకర్యం ఉండాలి.

దాడి చేసి.. దోచుకుని

- పని ఉందంటూ వృద్ధురాలిని తీసుకెళ్లిన దుండగుడు
- నిర్మానుష్య ప్రదేశంలోకి వెళ్లగానే రాయితో దాడి
- ఆభరణాలు లాక్కొని పరార్



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ, ఏసీపీ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పని ఉంది రావాలని ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి దాడి చేసి అందిన కాడికి దోచుకెళ్లిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం ..మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామానికి చెందిన రుక్కమ్మ (55) షాద్‌నగర్‌లో అడ్డా కూలీగా పని చేస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం అడ్డాపై పనికోసం నిలబడి ఉంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పని ఉంది రావాలని తన బైక్‌పై రుక్కమ్మను ఎక్కించుకొని వెళ్లాడు. ఎలికట్ట శివారులోని ఓ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను లాక్కున్నాడు. విషయం ఎవరికైనా చెబుతుందనే భయంతో రాయితో వృద్ధురాలిపై దాడి చేశాడు. తల భాగంలో కొట్టడంతో రుక్కమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్పృహ తప్పి పడిపోయింది. చనిపోయిందనుకున్న దుండగుడు అక్కడి నుంచి ఉడాయించాడు. సాయంత్రం స్పృహలోకి వచ్చిన రుక్కమ్మ గాయాలతో నడుచుకుంటూ రోడ్డుపైకి వస్తుండగా దారిన వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రుక్కమ్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడిపై ఆరా తీశారు. వృద్ధురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డేంజర్‌బెల్స్ @ సాగర్ రోడ్డు

- ప్రమాదాలకు నిలయంగా హైదరాబాద్‌–సాగర్ రహదారి
- రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వ్యాపారులు
- గునగల్ గేట్ వద్ద గ్రిల్స్ తొలగించి మరీ వెంచర్లకు బాటల ఏర్పాటు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


గునుగల్ గేటు సమీపంలో తొలగించిన గ్రిల్స్

యాచారం: హైదరాబాద్‌–నాగార్జునసాగర్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపడుతుండంతో కుచించుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. వివరాల్లోకి వేస్తే.. ఇబ్రహీంపట్నం ఖానాపూర్ గేట్ నుంచి మాల్ వరకు ఉన్న హైదరాబాద్‌– సాగర్ వరకు సింగిల్ రోడ్డుగా ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇంత రద్దీ ఉన్న రహదారిపై రోడ్డును ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. వంద అడుగుల రహదారిపై 33 అడుగుల బీటీ రోడ్డు ఉంది. అటు, ఇటు 33 అడుగులు రోడ్డు భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) పరిధిలో ఉంటుంది. రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉన్న 100 అడుగుల్లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి మాల్ వరకు పలుచోట్ల నిబంధనలు అతిక్రమించి పలు నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో రోడ్డు కుచించుకుపోయి ఎదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల సంఖ్య కూడా పెరగడంతో రోడ్డు రద్దీగా మారి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

గ్రిల్స్ తొలగింపు..

సాగర్‌రోడ్డుపై ఆగాపల్లి–గునుగల్ గేట్ మధ్యన ఉన్న రోడ్డు అత్యంత ప్రమాదకర రోడ్డు(డేంజర్ జోన్)గా.. ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖలు నిర్ధారించాయి. గతంలో ఈ స్థలంలోనే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది మరణించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మూడేళ్ల కిందట ఆగాపల్లి–గునుగల్ గ్రామాల మధ్యన సాగర్ రోడ్డుపై ఇరుపక్కల ఆర్‌అండ్‌బీ వారు ఇనుప కడ్డీల గ్రిల్స్‌ను బిగించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొద్ది నెలలుగా ఇరువైపులా వ్యవసాయ పొలాలను కొనుగోలు చేసిన వ్యాపారులు రాత్రిపూట గ్రిల్స్‌ను తొలగించి అక్రమంగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు వెంచర్లు చేసి రోడ్లను నిర్మిస్తుండగా, మరి కొందరు తోటలకు రోడ్డును నిర్మించుకుంటున్నారు. గ్రిల్స్ తొలగింపు విషయమై స్థానికులు, ప్రజాప్రతినిధులు రోడ్డు భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ ఆరోపణలు న్నాయి. గునుగల్ క్రీడా క్షేత్రం సమీపంలో ఓ పెంట్రోల్ బంక్ యజమాని బీటీ రోడ్డుకు రెండు అడుగుల దూరంలోనే దిమ్మెలు కట్టి జెండాలు పాతాడు. ఎదురుగా వాహనాలు వస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిజానికి రోడ్డుకు ఇరువైపులా 33 అడుగుల దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని రోడ్డు భవనాల శాఖ నింబంధన ఉంది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



సాగర్ రోడ్డుపై వాహనాల రద్దీ బాగా పెరిగింది. ఇబ్రహీంపట్నం, గునుగల్, ఆగాపల్లి, యాచారం, మాల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పెరిగింది. కొద్ది రోజుల క్రితం చౌదర్‌పల్లి గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు విస్తరణ చేపట్టాలి.

– రవి, ఉపాధ్యాయుడు, ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాల

చర్యలు తీసుకుంటాం



రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉన్న 100 అడుగుల రోడ్డుపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. సాగర్‌రోడ్డుపై అక్రమ నిర్మాణాలు, గ్రిల్స్ తొలగింపు ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. రెండు రోజుల్లో తనిఖీలు చేసి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇస్తాం. ఆక్రమణదారుపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌కుమార్, ఏఈఈ, రోడ్డు భవనాల శాఖ

పెద్దలు చేసిన పెళ్లి ఇష్టం లేదని..

మహిళ బలవన్మరణం

చేవెళ్ల: పెద్దలు చేసిన పెళ్లి ఇష్టం లేని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చేవెళ్లలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బతుకుదెరువు కోసం చేవెళ్లలో నివాసం ఉంటున్న తూర్పు పకీరమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కూతురు పద్మకు నాలుగు నెలల కిత్రం వివాహం చేసింది. ఈ పెళ్లి ఇష్టం లేని పద్మ.. ఇటీవల తల్లి వద్దకు వచ్చి ఉంటుంది. తనకు ఇష్టం లేని వివాహం చేశారనే మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయిని తరలిస్తున్న ముఠా అరెస్టు


పట్టుబడిన ముఠా సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కర్మన్‌ఘాట్‌కు చెందిన మైలపల్లి వెంకటరంగనాథ్, కుంట్లూర్‌కు చెందిన మొరపాకల శ్రీనివాస్, హయత్‌నగర్‌కు చెందిన నాయిని శ్యాం, విఠల్, మహ్మద్ ఖాసీం, కుంట్లూర్‌కు చెందిన మారగోని కృష్ణాగౌడ్, ఒడిశా రా ష్ట్రం మల్కన్‌గిరికి చెందిన అర్జున్‌లు ముఠాగా ఏర్ప డి ఒడిశాలోని కురుమనూర్ నుంచి హైదరాబాద్ లోని హయత్‌నగర్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సహకారంతో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మ ండలం అనాజ్‌పూర్‌లో ముఠా సభ్యుల్లోని వెంకటరంగనాథ్, శ్రీనివాస్, శ్యాం, కృష్ణాగౌడ్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి 11 కిలోల గంజాయితో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా నిందితులకు రిమాండ్ విధించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

షాద్‌నగర్: ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షాద్‌నగర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్న ట్లు చెప్పారు. ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన


మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మొయినాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిల్చుని వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాదబీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు రెక్కాడితేగానీ డొక్కాడని దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారి డిమాండ్లను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రత్నం, సుధాకర్, నర్సింహ, ప్రవీణ్, లక్ష్మి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆదరించండి


గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- పేదల సంక్షేమానికి అనేక పథకాలు
- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంటతండా, వాచ్యతండా, దరోమ్యతండా, ఇంద్రానగర్ గ్రామాల్లో నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గ్రామాలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాయని తెలిపారు. ప్రతి పల్లెకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పారు. గతంలో తాగునీటి కోసం ఎంతో ఇబ్బంది పడేవారని ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానంతో మిషన్ భగిరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా సౌకర్యం కల్పించినట్లు ఆయన వివరించారు. రైతుబంధు, రైతుబీమా లాంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రపంచ దేశాలలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపాడన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, జడ్పీటీసీ బంగారు స్వరూప, పీఏసీఎస్ చైర్మెన్ దామోదర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు సయ్యద్ హఫీజ్, శ్రీదర్ రెడ్డి, నాయకులు బాబురావు, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, స్వామి, నర్సింగ్‌రావు, అక్రమ్, రామచంద్రయ్య, గోపాల్, హరినాయక్, రమేష్‌నాయక్, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గృహలక్ష్మికి రూ.6లక్షలు ఇవ్వాలి

ఎమ్మెల్యే అంజయ్యకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి


ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు రూ.6లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం సిమెంట్, స్టీల్, ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, 3లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని చెప్పారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం కోసం రూ 6 లక్షలను వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఒకేసారి లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలన్నారు. గతంలో కొందుర్గు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 237లో వంద మందికి 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేసి ఇల్లు కట్టించాలని కోరారు. చౌదరిగూడలోని సర్వే నంబర్ 142లో 42 మందికి ఇళ్ల పట్టాలను తయారు చేసిన అధికారులు లబ్ధిదారులకు ఇవ్వలేదని, ఆ ఇళ్ల స్థలాలను అందజేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వెంకటేష్, బాలమ్మ, మంజుల, రాములమ్మ, అనిత, అనంత, యాదమ్మ, సునీత, బాల్‌రాజ్, కిషోర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఆమనగల్లుకు డిగ్రీ కళాశాల మంజూరు

- తలకొండపల్లికి జూనియర్ కళాశాల కూడా..
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్లడి
- డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. గత ఎన్నికల ముందు సీఎం ఆమనగల్లుకు ఇచ్చిన హామీలు కొంచెం ఆలస్యమైనా అన్ని అమలవుతున్నాయని చెప్పారు. జిల్లా పునర్విభజన అనంతరం రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు వివిధ డివిజన్ కార్యాలయాలు లేక ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను అభ్యర్థించగా.. సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికే పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆమనగల్లులో ఆర్డీఓ, ఎస్టీఓ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటు ప్రతిపాదనల దశలో ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఇప్పటికే ఆమనగల్లుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కాగా, ప్రస్తుతం డిగ్రీ కళాశాల మంజూరు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ జీఓ జారీ చేశారని వెల్లడించారు. అలాగే తలకొండపల్లికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆమనగల్లులోని 9.17 ఎకరాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం జరుగుతుందని, అక్కడే పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలకు భవనాలను నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో వివిధ పథకాల కింద పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ఆమనగల్లులో ఉన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల కారణంగా ఇన్నాళ్లు అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆమనగల్లుకు పట్టిన గ్రహణం వీడిందని, ఇక రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఆమనగల్లులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని జైపాల్‌యాదవ్ వివరించారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేకి..

కాంగ్రెస్‌పార్టీ రైతులకు వ్యతిరేకమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని ప్రకటించడం రైతులపై ఆ పార్టీకి ఉన్న ప్రేమ తెలుస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారని ఆయన చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ అనిత, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిట్టి నారాయణ, జిలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, టీఆర్‌ఎస్ నాయకులు చుక్క నిరంజన్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, పంతునాయక్, బీమయ్య, గండికోట శంకర్, రమేష్‌నాయక్, వడ్డె వెంకటేశ్, బాస్కర్, కిరణ్, ప్రసాద్, రైసల్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ నేత ఆచారి

తలకొండపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రజాభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పార్టీ నాయకులకు సూచించారు. స్వర్ణశక్తికర్ణ అభియాన్‌లో భాగంగా కేంద్రపథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నారం, చుక్కాపూర్, యడవల్లి, చీపునుంతల, సడక్‌తండా, వెంకటాపూర్‌తండా, పెద్దూర్‌తండా, పెద్దూర్, పడకల్, లింగరావుపల్లి, రామాకృష్ణాపురం తదితర గ్రామాల్లో ఆచారి పర్యటించి బూత్‌లను పరిశీలించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు రవిగౌడ్‌తో కలసి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికి చేయూత అందించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నియంత పాలను సాగుతోందని, ప్రజలు బీఆర్‌ఎస్ పాలనను చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పెద్దూర్‌తండాలో పెద్ద ఎత్తున యువత ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పంచ్ కుమార్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాసురెడ్డి, శ్రీశైలం, శివ, హార్యనాయక్ పాల్గొన్నారు.


పెద్దూర్‌తండాలో ఆచారి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కొత్తూరు: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరిలాల్(48) కొన్నిరోజుల నుంచి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ పరిధిలో ఇతర కార్మికులతో కలిసి రైల్వేకూలీగా పనిచేస్తూ అక్కడే గుడారాల్లో నివాసం ఉంటున్నాడు. ఉదయం కొత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ఓ మృతదేహం పడి ఉందని లోకోపైలట్ ఆర్‌కే సింగ్ సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న ఇతర కార్మికులు హరిలాల్ మృతదేహంగా గుర్తించారు. మృతుడికి వివాహం కాకపోవడంతో పాటు ఇతర కారణాల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు అతడితో ఉంటున్న కార్మికులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.